చిన్నకథ

# అంతర్ముఖుడు

- పి.ఎస్.నారాయణ



నాకు చిదానందాన్ని చూస్తుంటే చిర్రెత్తుకొస్తుంది.

అతను మా కంపెనీ క్యాంటీన్‌లో సూపర్‌వైజరు. అతడి పని రోజూ క్యాంటీన్‌లో క్యాష్ కౌంటర్‌లో కూర్చొని టిక్కెట్లు అమ్మడం.... పొద్దున్నే బ్రేక్‌ఫాస్టు, టీ, మధ్యాహ్నం లంచ్, సాయంత్రం స్నాక్స్, టీ దొరుకుతయి అక్కడ. రెండువేలమంది దాకా ఉద్యోగులున్నారు. క్యాంటీన్‌లో పదార్థాలు బహురుచిగా వుంటయి. అందుకే మా దగ్గర పనిచేసే చాలామంది మధ్యాహ్నం లంచ్ డబ్బాలు తెచ్చుకోరు. ఉదయం పూట ఉపాహారం కూడా అక్కడే తింటుంటారు. కంపెనీయే సగం ఖర్చు భరిస్తుండడంతో వాటి ఖరీదు గూడా చాలా తక్కువ.

చిదానందం ఆ ఉద్యోగంలో జేరి సంవత్సరమయింది. అదీ మా దగ్గర చేసి రిటయిరయిన ఓ మేనేజరు మాట సాయంతో! అతగాడు కష్టపడి పనిచేస్తున్న మాటయితే వాస్తవమే గాని టిక్కెట్ల అమ్మకంలో లెక్క సరిగ్గా వుండదు. తరచూ అమ్మిన టిక్కెట్లకంటే వసూలయిన డబ్బు పదీ పరకా తక్కువగానే వుంటుంది.

రోజూ సాయంత్రం అయిదింటికల్లా నా దగ్గరకు వచ్చి మిగిలిన టిక్కెట్లూ, వసూలయిన డబ్బు ఇవ్వాలి. నేను లెక్క చూసుకుని స్ట్రాంగ్‌రూంలో వున్న మా బీరువాలో పెట్టి వస్తుంటాను. వారం క్రితం ఒక రోజు వందరూపాయలు తక్కువ వచ్చింది. నేను చివాట్లు పెట్టాను. పేరుకు తగ్గట్లే నవ్వేసి ఊరుకున్నాడు. మామూలుగా మరునాడు టిక్కెట్లు తీసుకెళ్లడానికి వచ్చినప్పుడు ఆ తరుగు ఇచ్చేసి వెళ్లిపోయాడు.

ఇలా తరచూ జరుగుతుండడంతో అనుమానమొస్తోంది నాకు. డబ్బులు అవసరమొచ్చినప్పుడల్లా ఇలా నొక్కేస్తుంటాడా అని! కానీ, అలా గట్టిగా ఓ నిర్ణయానికి రాలేకపోతున్నాను. మరునాడు ఉదయాన్నే తీసుకొచ్చి ఆ తరుగును పూడ్చేస్తున్నాడే... అందుకే నిజంగానే పోతున్నాయ్యేమోనని అనుకోవాల్సి వస్తోంది ఒక్కొక్క సారి!

కానీ అతడి మొఖంలో డబ్బు ఎంత తరుగొచ్చినా కించిత్ చిరునవ్వు కూడా తరగదు. అదో విచిత్రం... నాకు తెలిసినంత వరకూ అతడికి ఎలాంటి దులవాట్లు లేవు. ఒంటరివాడు. ఇంకా పెళ్లికాలేదు. ఇతడు పెట్టి పోషించాల్సిన వాళ్లు, ఇతడి మీద ఆధారపడి వున్నవాళ్లు ఎవరూ లేరు. అమ్మా,నాన్న వాళ్ల ఊళ్లోనే వుంటారు. అతడి మాటల్ని బట్టి వెనకాల ఇల్లు, పొలాలూ వున్నాయి. వాళ్ల తిండి వాళ్లే తింటున్నారు. ఇతడికేమో ఇక్కడ క్యాంటీన్‌లో లోపల కూర్చొని కడుపునిండా అన్నీ తినేసే వెసులుబాటు వున్నది. ఎవరో స్నేహితుడితో కలిసి కంపెనీకి నడిచి వచ్చే దూరంలోనే ఓ గదిలో వుంటున్నాడు. రాత్రిపూట బయట తిండికే అతడు ఖర్చు పెట్టాలి. జీతం నెలకు రెండు వేల పైనే ఇస్తాం!

మరి?

నిజంగా వాడిని అమాయకుడిని చేసి వర్కర్స్ ఏడిపిస్తున్నారా?

ఒకసారి నేను గట్టిగా అరిస్తే, ''ఏమిటో సార్ నాకూ అంతు పట్టటం లేదు...ఒక్కొక్కడు పది నోటిస్తాడు. టిక్కెట్‌తో పాటు మిగిలిన చిల్లరిస్తే, నేను ఇరవైనోటిచ్చాను తక్కువిస్తున్నావేం అంటాడు. వాడన్నట్లు ఇవ్వకపోతే ఇదో గోల'' చిరునవ్వుతో చెప్పాడు.

నాకు అక్కడే తిక్కరేగేది.

ఇన్ని డబ్బులు పోతున్నయ్యా..అయినా కనీసం దిగులు పడుతున్నట్లుగా గూడా ముఖం కనపడదు. ఆ మాటలు చెబుతూ చిదానందంగా నవ్వేస్తుంటాడు.

రోజురోజూ జరుగుతున్న ఈ తంతును భరించలేక ఓ రోజు సాయంత్రం నా ఎదురుగ్గా కూర్చోబెట్టుకొని క్లాసు పీకాను. ''టిక్కెట్లు అమ్మడం సరిగ్గా చేతకాకపోతే లోపల వంటవాళ్ల మీదో, మిగతా పనివాళ్ల మీద అజమాయిషీ చేయి. అంతేగానీ రోజూ ఈ వెధవ గోలేమిటి?'' అంటూ..

వాడు నవ్వేసి, ''ఆ ఉద్యోగాలు హుందాగా వుండవు సార్'' అన్నాడు.

నాకోపం నషాళానికి అంటింది. గొంతు పెంచాను. ''మరి రోజూ జేబుకు చిల్లు పెట్టుకు కూర్చుంటావా..నీకొచ్చే జీతం తరుగులు కట్టేందుకే సరిపోతుంది. ఇంకెందుకు ఈ బోడి సేవ? శుభ్రంగా మానేసి ఇంటికిపోయి... పొలాలున్నయ్యంటివిగా.. వ్యవసాయం చేసుకో.. హాయిగా ఏ దిగులూ వుండదు. అటు పెద్దవాళ్లకు తోడుగానూ వుంటావ్!''

''ఇంకా కొన్నాళ్లు అది కుదర్దులెండి సార్!'' అన్నాడు తలవంచుకొని దిగులుగా.

ఇంట్లో పెద్దవాళ్లతో తగువులాడి వచ్చేయలేదు గదా! ''ఏం ఎందుకు కుదర్దు!'' సీరియస్‌గానే అడిగాను. ''అవునూ..చిన్న నోటిచ్చి పెద్ద నోటిచ్చాననేవాడు రోజూ ఒకడేనా? వేరు వేరా?'' ఎంత కోపంగా వుందామన్నా వాడి ముఖం చూస్తుంటే జాలివేస్తోంది.

''అలా రోజు కాదు సార్...!''

''లాభం లేదు గాని..క్యాష్‌తో నీ వల్ల కాదు. ఉద్యోగం మానేసినా సరే...లేదా వేరే డిపార్ట్‌మెంటుకు వెళ్లినా సరే..ఎందుకు చెబుతున్నానంటే రేపు క్యాంటిన్ కమిటీకి ఈ విషయం తెలిసిందో..నీ ఈ బోడీ టెంపరరీ ఉద్యోగాన్ని పీకి అవతల పారేస్తారు. అప్పుడు నన్ను మాత్రం అనవద్దు. నేను ముందుగా హెచ్చరిస్తున్నాను'' అన్నాను చివరి ఆయుధంగా.

''సార్! ఇదెవ్వరికీ తెలియదు. అందునా మీకు మాట రాకుండా నేను ఎప్పటి డబ్బులు అప్పుడు ఎంత తక్కువయినా తెచ్చి ఇస్తూనే వున్నాను కదా. ఒక్క రెండు నెలలు ఓపిక పట్టండి సార్! చాలు..'' అన్నాడు రెండు చేతులూ జోడించి.

''ఆ తరువాత ఏం చేస్తావేం?'' అన్నాను ఎగతాళిగా. ''అప్పటికి గాని మంచి ముహూర్తం లేదా వెళ్లిపోవడానికి!''

''నాకిప్పుడు మావాళ్లు సంబంధాలు చూస్తున్నారు సార్. ఇంత పెద్ద కంపెనీలో సూపర్‌వైజర్ పనిచేస్తున్నాను అంటే ఎంత గొప్పగా వుంటుందండీ. బాగా కట్నం వస్తుంది. ఊళ్లో వుండి వ్యవసాయం చేసుకుంటున్నానంటే ఎవరిస్తారు సార్ అంత కట్నం. పెళ్లి చేసుకున్న తరువాత ఉద్యోగం వదిలేసినా అడిగేవాళ్లుండరు. అప్పటిదాకా నా మీద ఎవరికీ రిపోర్ట్ చేయవద్దు సార్.'' అన్నాడు నా చేతులు పట్టుకు బతిమిలాడుతూ జాలిగా చిదానందం.

*